క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయాలి



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనివారం టీయూడబ్ల్యూజె ద్వితీయ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బాదినేని ప్రవీణ్, రాజేంద్రప్రసాద్, సంతోష్, చారి, శ్యామ్, రవి, సమ్మయ్య, రాంబాబు, సత్యనారాయణ, వికాష్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



వాజేడు: నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో శనివారం పలు కుటుంబాల చేరాయి. మండల పరిధిలోని సుందరయ్యకాలనీలో బుచ్చయ్య, గుమ్మడి దొడ్డి గ్రామ సర్పంచ్ పాయం జయలక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పార్వతి, మోహన్‌రావు, గణపతి, సాంబమూర్తి, వేణు, సాంబశివరావు, ప్రకాష్, రమేష్, శ్రీనివాస్, గిరిబాబు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



వాజేడు: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన మోడెం బుచ్చయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బుచ్చయ్య బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచ్ జయలక్ష్మి, మోహన్‌రావులతో కలిసి ఆర్థికసాయంను అందజేశారు.

అల్పాహారం అందజేత



వెంకటాపురం(కె): స్థానిక శివాలయంలో శనివారం శక్తి మాలదారులకు దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం అంకన్నగూడెం గ్రామ సమీపంలో బస్సు ప్రమాదం జరిగి డ్రైవర్ మృతి చెందాడు. దీంతో బస్సులో ఉన్న 45 మంది శక్తి మాలదారులను పోలీసులు మండల కేంద్రంలోని శివాలయానికి తరలించారు. వారికి శనివారం ఉదయం దిశ ఫౌండేషన్ సభ్యులు పిల్లాల లీలారాణి, సుభాషిణి అల్పాహారం అందజేశారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



ఏటూరునాగారం: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని రొయ్యూర్ సర్పంచ్ జెట్టి సమత ఈశ్వర్ అన్నారు. శనివారం రొయ్యూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలను ఆమె అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలను అందజేసేందుకు తను సొంతగా రూ.5వేలు, ఉప సర్పంచ్ చంటి రూ. 2వేలు, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్ రూ.2వేలు ఆర్థిక సహాయంతో వాటిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు స్వామి, కోఆప్షన్ సభ్యులు శ్రీ ఖలీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లూరు గుట్టపై అధికారుల సర్వే

- మ్యాప్ ఆధారంగా హద్దుల పరిశీలన
- నివేదికను కలెక్టర్‌కు అప్పగించనున్న రెవెన్యూ అధికారులు



మల్లూరు హేమాచల క్షేత్రం ప్రాంగణంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మంగపేట: రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధిగాంచిన మల్లూరు గుట్టపై తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం సర్వే ప్రారంభించారు. మల్లూరు గుట్ట అటవీశాఖ పరిధిలో ఉందని అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో హేమాచల క్షేత్రానికి వచ్చే భక్తుల వాహనాలకు రుసుము వసూలు చేసేందుకు గుట్టపై చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్తులు, దేవాదాయశాఖ అధికారులు హేమాచల క్షేత్రం 400 ఏళ్ల క్రితమే ఉందని అప్పటికీ అటవీ శాఖ ఏర్పడలేదని పూర్వీకులు ఇక్కడ నివసించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయన్నారు. ఆలయం ఆలయ పరిసరాలు ప్రభుత్వ పరిధిలోని వస్తాయని అందుకు సంబంధించిన 1945, 1965కు సంబంధించిన మ్యాప్‌లను అటవీశాఖ అధికారులకు చూపించి చెక్‌పోస్టు ఏర్పాటును అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా అటవీశాఖ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి రుసుము వసూలు చేయడం ప్రారంభించారు. దీంతో దేవాదాయశాఖ ఆలయ ఈఓ సత్యనారాయణ జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక అందచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ములుగు డీఐ రాజనర్సయ్య, సర్వేయర్ పాయం వీరస్వామి 1946 మ్యాప్, నక్షా ప్రకారంగా సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మ్యాప్‌లో ఉన్న ప్రకారంగా పరిశీలిస్తే మల్లూరు నుంచి ఆలయానికి ప్రత్యేక దారి ఉన్నట్లు తెలుస్తోంది. పూర్వ నివాస గృహాలు ఉన్నట్లు మ్యాప్‌లో ఉందన్నారు. ఆలయం, జీపీఎస్ ద్వారా పరిశీలిస్తే ఆలయం, పరిసరాలు సర్వే నంబర్ 348 లో చూపిస్తున్నాయని 348 సర్వే నంబర్‌లో 4532 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉందన్నారు. అయినప్పటికీ 1957 గెజిట్ ప్రకారం మల్లూరుగుట్టతో పాటు మండలంలోని 10 గ్రామాల పరిదిలో 75,587 ఎకరాల భూమి అటవీశాఖ పరిధిలో ఉందని అధికారులు అంటున్నారన్నారు. ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు సర్వే చేస్తున్నామని 1946 మ్యాప్‌లో ఉన్న ప్రకారం సర్వే నిర్వహించి హద్దులు గుర్తించి సర్వే నివేదికను కలెక్టర్‌కు అందచేయనునట్లు తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- ములుగు ఆర్డీఓ రమాదేవి



వెంకటాపురం(ఎం): దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

వెంకటాపురం(ఎం): మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ములుగు ఆర్డీఓ రమాదేవి కోరారు. శనివారం మండలంలోని పాలంపేటలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు ఆమె హా జరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు ఎ లాంటి భూ సమస్య ఉన్న రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, సర్పంచ్ డోలి రజిత, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఆర్ఐ రాజకుమారి, పాల్గొన్నారు.

ములుగు రూరల్ : మండలంలోని రాంచంద్రాపురంలో శనివారం నిర్వహించిన గ్రామసభకు తహసీల్దార్ సత్యనారాయణ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతులు తమ భూముల సమస్యలపై కలెక్టర్, రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకున్న సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పట్టా పాస్ పుస్తకాల కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్న వాటిని పరిశీలించారు. సుమారు 35 దరఖాస్తుల్లో సుమారు 10 మంది పాస్‌పుస్తకాల కోసం మీ సేవా ఆధారంగా వేలిముద్రలను సేకరించామని అన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ స్వామి కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

‘తొలిమెట్టు’తో సామర్థ్యాల స్థాయి పెంపు



వెంకటాపురం(ఎం): తొలిమెట్టు కార్యక్రమంతో విద్యార్థుల్లో సామర్థ్యాల సాధన స్థాయి పెరిగిందని మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి ప్రభాకర్ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను లక్ష్మీదేవిపేట కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు సురేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా అనంతరం విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందుతున్నాయని, ఉపాధ్యాయులందరూ చాలా చక్కగా పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అడిచెర్ల రాజయ్య, రాష్ట్ర బాధ్యులు పెండ్యాల సలేంద్రం, విష్ణు, రామాంజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రమేష్, సూత్రాల రవి, మహిళా ఉపాధ్యక్షురాలు నూనె ప్రవీణ, కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

కిచెన్ షెడ్డు ప్రారంభం

ఏటూరునాగారం : మండలంలోని కోయగూడ ఎల్లాపురం పంచాయతీలోని లంబాడీతండా ప్రాథమిక పాఠశాలలో ఈజీఎస్ కింద నిర్మించిన కిచెన్ షెడ్డు(వంటగదిని) శనివారం ఉపసర్పంచ్ గార నగేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, టీఏలు, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశానికి తరలిరావాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

వెంకటాపురం(ఎం): ఈనెల 10న మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మల్లాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, సర్పంచ్‌లు మాడ ప్రకాష్, భద్రయ్య, యూత్ మండల అధ్యక్షులు గణేష్, ఎన్ఎస్‌యూఐ. జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి జంగిలి రవి, యూత్ జిల్లా అధికార ప్రతినిధి సుమన్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆంగ్లభాష పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఏటూరునాగారం : ఎంపిక పత్రాన్ని సాయిలతకు అందజేస్తున్న న్యాయ నిర్ణేతలు



మంగపేట : స్పెల్ విజర్డ్, స్టోరీ టెల్లింగ్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న రాజేష్‌కుమార్

ఏటూరునాగారం : స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో సెల్ఫ్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ ఆంగ్లభాష పోటీలను నిర్వహించినట్లు ఎల్టా సంఘ బాధ్యులు వెంకటరమణ, అశోక్, శంకర్, సతీష్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలు ప్రధానోపాధ్యాయులు అనంతుల సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్టోరీ టెల్లింగ్ విభాగంలో మధుప్రియ, బిందు సాయిలత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపికయ్యారు. స్పెల్ విజార్డ్ విభాగంలో నవదీప్, పావని ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందారని వారు తెలిపారు. వీరందరూ ఈనెల 22న ములుగు జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. న్యాయనిర్ణేతలుగా షేక్ హాజీ నూరానీ, చెంచయ్య, రాములు ఉన్నారు.

స్టోరీ టెల్లింగ్ పోటీలు ప్రారంభం

మంగపేట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఎస్ఈఆర్‌టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్ విజర్డ్, స్టోరీ టెల్లింగ్ మండల స్థాయి పోటీలను ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్ శనివారం ప్రారంభించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థుల్లో స్పెల్ విజర్డ్ పోటీలో మొదటి బహుమతి అర్జున్‌జ్ఞానదీప్, రెండో బహుమతి అక్షర గెలుచుకున్నారు. స్టోరీ టెల్లింగ్ పోటీల్లో మొదటి బహుమతి జె.ప్రశాంతి, రెండో బహుమతిగా అక్షర గెలుచుకున్నారు. ఆయా విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు రాజేష్ కుమార్, ఈఎల్‌టీఏ కన్వీనర్ కోడి వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మేనక, సమ్మయ్య, రఘుపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష సామర్థ్యాలపై పట్టు సాధించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: ఆంగ్ల భాష సామర్థ్యాలపై విద్యార్థులు పట్టు సాధించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ యాప సాంబయ్య అన్నారు. శనివారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషపై ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థినులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సాంబయ్య, నోడల్ అధికారి రేగ కేశ్వరావు, హెచ్ఎం పద్మలు హాజరయ్యారు. ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలకు చెందిన స్వాతిక్ ప్రథమ స్థానం సాధించగా తాడ్వాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని మమతా ద్వితీయ స్థానం, తాడ్వాయి కస్తూర్బా గాంధీ గురుకులం పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉమారాణిలు తృతీయ స్థానం, కాటాపూర్ జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థిని విజయ నాలుగోవ స్థానం సాధించారు. విద్యార్థినులకు హెచ్ఎం పద్మ సర్టిఫికెట్లు అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు రామచందర్, కే విశ్వనాథంలు పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారులకు చదువు



మొబైల్ ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

ఏటూరునాగారం: ఆట పాటలతో ఆంగన్‌వాడీ బడిలోని చిన్నారులకు చదువు చెప్పాలని సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎక్కెల అంగన్‌వాడీ కేంద్రంలో కేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ద్వారా చిన్నారులకు ఆట వస్తువులను అందజేశారు. చిన్నారులు ఈ ఆట వస్తువులతో ఆడుకోవాలని, అంగన్‌వాడీ టీచర్లు అభ్యసనతో కూడిన చదువు చెప్పాలన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న పాలు, కోడిగుడ్లు, అందించాలన్నారు. టీచర్లు అన్నపూర్ణ, విజయ, పంచాయతీ కార్యదర్శి అశోక్, హెచ్ఎం సమ్మయ్య పాల్గొన్నారు.

ఆధార్ తప్పనిసరి

ఐదేళ్లు దాటిన చిన్నారులకు ఆధార్ తప్పనిసరి అని సర్పంచ్ రామ్మూర్తి అన్నారు. ఎక్కెలలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్‌కార్డు నమోదు కోసం ఏర్పాటు చేసిన మొబైల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ బడికి వచ్చే చిన్నారులకు కూడా ఆధార్‌కార్డును దింపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనపత్రాలు లేకుంటే చర్యలు తప్పవు



తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్

కన్నాయిగూడెం: వాహనాలకు లైసెన్స్ పత్రాలు లేకుంటే చర్యలు తప్పవని ఎస్సై సురేష్ అన్నారు. బుట్టాయిగూడెం తాటిచెట్ల వద్ద ప్రధాన రహదారిపై శనివారం ఎస్సై వాహనాలను తనిఖీ చేశారు. ఏటూరునాగారం, తుపాకులగూడెం, పలిమెల మహాముత్తారం, మహారాష్ట్ర నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రధాన రహదారిపై వాహనాలను నడిపే వారికి లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని బెల్టుషాపులు, గుడుంబా అమ్ముతున్న వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేష్‌కుమార్

మంగపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు చందా బద్రయ్య, ఉపాధ్యక్షులు నాగేందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి అనసూర్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సత్యనారాయణ, మంగపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మేనక, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, మండల బాధ్యులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

- రూ.8 వేల నగదు, ఆభరణాల అపహరణ



భాస్కర్ ఇంట్లోని బీరువాలో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

మంగపేట : మండలంలోని బోరునర్సాపురం గ్రామానికి చెందిన బిల్‌పాటి నర్సయ్య, మల్లూరు పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంకు చెందిన జెజ్జరి భాస్కర్ ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులు పొలంలో వరినాటు వేయడానికి వెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో నర్సయ్య గ్రామంలోని ఓ షాపుకు వెళ్లాడు. అదే సమయంలో దొంగలు ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న రూ.3 వేల నగదు తీసుకుని, బీరువాలో ఉన్న రెండు బంగారు ఉంగరాలు, 3 వెండి మొలతాడును అపహరించారు. ఆ సమయంలో నర్సయ్య ఇంటికి రావడంతో దొంగలు ఇంటి వెనుక తలుపులు తీసుకుని పరారైనట్లు తెలిపాడు. అదేవిధంగా మామిడిగూడెంలో భాస్కర్ మిరపచేను వద్దకు వెళ్లగా తన కుమారుడు పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలకు భాస్కర్ భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాడు. తాళం తీసి ఇంట్లోకి రాగా బీరువాతెరువగా బట్టలు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.5 వేల నగదు అపహరించాడని బాధితుడు భాస్కర్ తెలిపాడు. చోరీ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఇద్దరు బాధితులు తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

టేకుమట్ల(రేగొండ): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేగొండ మండలంలోని చిన్నకోడెపాకలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కూనూరు శ్రీనివాస్(72) వృద్ధుడు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండే వాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి చెందిన ఆయన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

జీఓ అమలులో జాప్యంపై నిరసన



ఏటూరునాగారం: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



మంగపేటలో...

ఏటూరునాగారం: తెలంగాణలోని వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్థానికతను దూరం చేసి వివాదాస్పదంగా నిలిచిన 317 జీఓ విడుదలై ఏడాది అవుతున్న సందర్భంగా శనివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో భోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం హాజీ నూరానీ, శ్రావణ్, రాజన్న మాట్లాడుతూ స్థానికతను పాతరేసి ఏకపక్షంగా అమలు చేసి 25 వేల ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రకాల ప్రత్యామ్నాయాలున్నా హడావిడిగా రాత్రి పగలు తేడా లేకుండా విచక్షణ మరిచి ఎన్నో తప్పులు దొర్లినా పట్టించుకోకుండా దౌర్జన్యపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ధర్మారావు, రాంబాబు, అశోక్, శంకర్, లక్ష్మణ్, శేఖర్, సమ్మయ్య, అనురాధ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, అక్బర్‌పాషా, రజిని, నాగరాజు, భాగ్యవతి, రాజేష్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

జీఓ నంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు టీవీ వీరభద్రం అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఎస్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ విజయ్, మండల అసోసియేట్ అధ్యక్షులు రాజేందర్, రాంబాబు, సమ్మయ్య పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని తిమ్మంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ మండలశాఖ ప్రధాన కార్యదర్శి సనప సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల స్థానికత 317 జీఓపై శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం 317 జీఓ తీసుకువచ్చి ఉపాధ్యాయుల జీవితాలను చిన్నాభిన్నం చేసిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, చారి, ప్రవీణ్, కమల్‌హాసన్, వెంకటేశ్వర్లు, ఓదెలు, సత్యనారాయణ, స్వర్ణలత, కవిత పాల్గొన్నారు.

11న సమావేశం


భూపాలపల్లి రూరల్: ఈనెల 11న కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో నిర్వహించనున్న జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తరలిరావాలని తెలిపారు. భరత్, నవీన్, పవన్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌ల నియామకం

టేకుమట్ల(రేగొండ): జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సోషల్ మీడియా వారియర్స్‌లో బీఆర్ఎస్ రేగొండ మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా దాట్ల రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు సోషల్ మీడియా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, ఎమ్మెల్యేకు, మండల నాయకులకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

కాటారం: బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం మండల ఇన్‌చార్జ్‌గా మండలంలోని చిద్నెపల్లికి చెందిన వంగళ రాజేంద్రాచారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శనివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

గోదావరిలో పడి బాలుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం మొర్రవానిగూడెం గ్రామ సమీపంలోని గోదావరి నదిలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా రాంపురం గ్రామానికి చెందిన మిచ్చా బోటి అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి మిర్చి తోటల్లో కూలి పనులు చేసుకునేందుకు శుక్రవారం మొర్రవానిగూడెం వచ్చాడు. ఉండేందుకు గోదావరి ఇసుక తిన్నెల్లో గూడారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం బోటి కుమారుడు మిచ్చా అంకిత్(4) సమీపంలో ఉన్న గోదావరిలో పడి మునిగిపోయాడు. బాలుడు కోసం గాలించగా మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం వెంకటాపురం వైద్యశాలలో బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.